

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 20.0



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న జీఎంఆర్

'పుట్టింది వ్యవసాయ కుటుంబం. మొదటి నుంచి మా కుటుంబానికి కాంగ్రెస్‌తో అనుబంధం ఉండేది. ప్రజలకు ఏదో రకంగా సేవ చేయాలని మొదటి నుంచీ ఉండేది. న్యాయవాద వృత్తి ద్వారా వచ్చే ఆదాయంతో సేవా కార్యక్రమాలు చేపట్టాను. విద్యా సంబంధిత సాయాలు, దేవాలయాల అభివృద్ధి, వైద్య ఖర్చులు ఇవ్వడం చేసేవాడిని. ఆ సేవా గుణాన్నే ఈ రోజు వరకు కొనసాగిస్తున్నాను. ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి రావాలని ఉన్నతమైన జీవితం, మంచి ఆదాయాన్ని తెచ్చే న్యాయవాద వృత్తిని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరాను. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో.. పోటీ చేసిన మొదటిసారే విజయం సాధించాను. నా ముందు చాలా లక్ష్యాలు ఉన్నాయి. ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు ప్రాథమ్యాలుగా ముందుకు సాగుతున్నా' అని అంటున్నారు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ప్రజాసేవ కోసమే.. రాజకీయాల్లోకి..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- అందుకే ఉన్నతమైన, ఆదాయం తెచ్చే వృత్తిని వదులుకున్నా
- పనితనం చూసే.. డీసీసీ బాధ్యతలు, ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు
- విద్య, వైద్యం, ఉపాధి రంగాల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నా
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, డిగ్రీ, ఇంటర్ కాలేజీల ఏర్పాటు
- ఇండస్ట్రియల్ కారిడార్, గుడిబండ వద్ద డ్రైపోర్టు ఏర్పాటు లక్ష్యం
- దేవరకద్రలో 100, కొత్తకోటలో 50 పడకల ఆస్పత్రులు, జానంపేటలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తాం
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కుటుంబ నేపథ్యం.. వృత్తి జీవితం ఎలా ఉండేది?

అమ్మానాన్న పద్మమ్మ, కృష్ణారెడ్డి. నాన్న సర్పంచుగా, సింగిల్ విండో డైరెక్టర్‌గా పని చేశారు. నేను 1999లో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన తర్వాత 2006లో సొంతంగా ప్రాక్టీస్ ప్రారంభించాను. ఆ వృత్తిలో మంచి సంపాదన, ఉన్నతమైన జీవితం ఉండేది. అక్కడ వచ్చిన డబ్బుల ద్వారా సేవా కార్యక్రమాలు ప్రారంభించాను. నా భార్య కవిత పూర్తిగా మద్దతు ఇచ్చేవారు. రాజకీయాల్లో రావాలని అనుకున్నప్పుడు కూడా ఎలాంటి అడ్డు చెప్పలేదు. కుమారుడు వినయ్ ప్రణీత్‌రెడ్డి అమెరికాలో చదువుతున్నాడు. కుమార్తె హైదరాబాద్‌లోనే చదువుతోంది. 2006లో ప్రాక్టీస్ తర్వాత

(మిగతా 4వ పేజీలో..)

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి రవినాయక్

కల్వకుర్తి/వెల్దండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి.రవినాయక్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో జరుగుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. సర్వేలో ప్రజలతో అన్ని వివరాలు అడిగి తెలుసుకుని సర్వే ఫామ్‌లో పొందుపర్చాలని ఎన్యుమరేటర్లను ఆదేశించారు. సర్వేకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. అదేవిధంగా వెల్దండ మండలకేంద్రంలో చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేను రవినాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నిర్వహించే కుటుంబాలకు ముందస్తుగానే సమాచారమిస్తే వారు తమకు సంబంధించిన ధ్రువపత్రాలతో సిద్ధంగా ఉంటారని అన్నారు. సర్వేలో ఎటువంటి తప్పులు దొర్లరాదని, యజమానుల సమాచారాన్ని నియామవళికి అనుగుణంగా పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎస్.శ్రీను, తహసీల్దార్లు ఇబ్రహీం, కార్తీక్ కుమార్, మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంఈవో చంద్రుడు, ఎంపీవో లక్ష్మణ్, కార్యదర్శి గిరి తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో సర్వేను పర్యవేక్షిస్తున్న జి.రవినాయక్

నేడు కురుమూర్తికి.. సీఎం రేవంత్‌రెడ్డి

- బ్రహ్మోత్సవాల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ఎలివేటెడ్ ఘాట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, డీఐజీ



కురుమూర్తి ఆలయ ప్రధాన ద్వారం



చిన్నచింతకుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి ఆలయానికి రానున్నారు. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు సీఎం రానుండటంతో దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి శనివారం జాతర మైదానంలో డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. జాతర మైదానంలో పర్యటించారు. ఆలయ రాజగోపురం సమీపంలోని స్టేజీ వద్ద అపరిశుభ్రత నెలకొందని, అక్కడ చెత్తా చెదారాన్ని తొలగించాలని అధికారులకు (మిగతా 4వ పేజీలో..)

వేర్వేరు చోట్ల రెండు ట్రాక్టర్లు బోల్తా ముగ్గురి మృతి

వనపర్తి రూరల్, రేవల్లి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల రెండు ట్రాక్టర్లు బోల్తాపడి ముగ్గురు మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన వనపర్తి జిల్లాలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి మండలంలోని సవాయిగూడెం గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన ఓ రైతు తన వరి చేనులో కలుపు తీసేందుకు అదే గ్రామానికి చెందిన 12 మంది కూలీలను ట్రాక్టర్‌పై తీసుకెళ్లాడు. పనులు ముగించుకుని సాయంత్రం వేళలో తిరి గి గ్రామానికి వస్తుండగా మూల మలుపు దగ్గర ట్రాక్టర్ బోల్తా పడి గోపాలమ్మ (59), పద్మ (55) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మిగతా వారు ప్రాణపాయంతో బయటపడ్డారు. క్షతగాత్రు లను చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారని గ్రామస్థులు తెలిపారు.

అదేవిధంగా రేవల్లి మండలం బడరావిపాకులలో ట్రాక్టర్ బోల్తా పడి, కౌలు రైతు దొడ్డి వెంకటేశ్(32) మృతిచెందాడు. ఎస్ఐ రాము తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగపూర్‌కి చెందిన దొడ్డి వెంకటేశ్ బండరాయిపాకులకు చెందిన ఒక రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని పత్తి సాగుచేశారు. శనివారం పత్తి తీయడానికి కూలీలను ట్రాక్టర్‌లో పొలం వద్దకు తీసుకుని వెళ్లాడు. అనంతరం ట్రాలీ అక్కడే వదిలి ట్రాక్టర్ ఇంజన్ తీసుకుని వస్తుండగా... పక్కనే ఉన్న గుంతలో ట్రాక్టర్ బోల్తా పడి మంటలు చెలరేగడంతో వెంకటేష్ కాళ్లు కాలిపోయాయి. బయటకు రాలేక అతను మృతి చెందాడు. అతని భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు. వెంకటేశ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దు

- కంపెనీ నిర్మాణ స్థలంలో ఆందోళన తెలిపిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

రాజోలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితిల్లో జరగనివ్వబోమని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శనివారం మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ స్థలంలో బీఆర్ఎస్ నాయకులు, ఎనిమిది గ్రామాల ప్రజలు, రైతులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పచ్చని పల్లెల్లో చిచ్చు పెడుతుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇక్కడ ఫ్యాక్టరీ పెడితే చుట్టుపక్కల గ్రామాల్లో నివసించే ప్రజలు కాలుష్యంతో రోగాల బారిన పడతారని, పంటలు పండక రైతులు ఇబ్బంది పడతారని సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. రాజోలి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయించాలని మాన్‌దొడ్డి పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యే విజయుడుకి వినతి పత్రం అందించారు. నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూర్ మాన్‌దొడ్డి, తుమ్మిళ్ల, తనగల, చిన్న తాండ్రపాడు, పచ్చర్ల, కేశవరం, తదితర గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

క్లిక్.. క్లిక్..



గ్రామాన్ని తాకుతున్న నాగార్జున సాగర్ నీరు


సాగర తీరం.. అందాల హారం

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు 70 కిలో మీటర్ల దూరంలోని ఆ ఊరు ప్రకృతి అందాలకు నెలవుగా మారింది. చుట్టూ నల్లమల కొండలు.. కృష్ణానది నీటితో ఆహ్లాదాన్ని పంచుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ గ్రామాన్ని తాకుతుండటంతో ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో నదిలో మత్స్యకారులు బోటులో చేపల వేటకు వెళ్లడం కనువిందు చేస్తోంది. 141 నివాసాలు, 537 మంది ఓటర్లు కలిగిన ఆ చిన్న గ్రామం బక్కలింగాయపల్లి అందాలను 'ఆంధ్రజ్యోతి' శనివారం క్లిక్ మనిపించింది.

- అచ్చంపేట, ఆంధ్రజ్యోతి



నదిలో చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారుడు



నల్లమల కొండలను ఆనుకొని ఉన్న బక్కలింగాయపల్లి గ్రామం

సర్వేకు సహకరించాలి

- గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలటౌన్, ఇటిక్యాల నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వే కోసం ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లు అడిగిన సమాచారాన్ని అందజేసి ప్రజలు సహకరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. శనివారం పట్టణంలోని రెండో రైల్వేగేటు, అశోక్‌నగర్ కాలనీ, ఇటిక్యాల మండలం పెద్దదిన్నెలో చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. ఎన్యుమరేటర్లు యజమానితో సేకరించిన సమాచారంలో పొరపాట్లకు తావు లేకుండా ఫారంలో నమోదు చేయాలన్నారు. పార్ట్-1లో యజమాని వివరాలు, పార్ట్-2లో కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు, వార్షిక ఆదాయం తదితర వివరాలు పొందపరచాలని తెలిపారు. ఇంటి యజమానితో పాటు కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసి కోడ్ నెంబర్లు వేయాలన్నారు. అంతకుముందు ఓటరు ప్రత్యేక నమోదు కార్యక్రమంలో బాగంగా ఇటిక్యాల, పెద్దదిన్నె గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డీపీవో శ్యాంసుందర్, గద్వాల, ఇటిక్యాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



గద్వాల పట్టణంలోని రెండో రైల్వే గేటు సమీపంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్



మన్ననూరు చెక్‌పోస్టు వద్ద నిలిచిన వాహనాలు

ట్రాఫిక్ జామ్ - నల్లమలలో వాహనాల రద్దీ

మన్ననూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్ - దోమలపెంట చెక్‌పోస్టు వద్ద వాహనాలు బారులు తీరాయి. శని, ఆదివారాలు సెలవులు రావడం.. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శ్రీశైలానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్తున్నారు. ఈ సందర్భంగా మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టుల వద్ద వాహనాలు కిలో మీటరు పొడవునా నిలవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. పర్యాటకులు నల్లమల అందాలను ఆస్వాదిస్తున్నారు. దీంతో మన్ననూరు, దోమలపెంటల్లోని పర్యాటక కాటేజీలన్నీ నిండి పోయాయి. పర్యాటకుల రద్దీ కారణంగా ప్రైవేటు, రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాల నిర్వాహకులకు వ్యాపారం బాగా సాగింది. శనివారం మూడు వేలకు పైగా వాహనాలు శ్రీశైలం వెళ్లగా మన్ననూరు, దోమలపెంట టోల్‌గేట్ కేంద్రాలకు రూ.3 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది.

పాలమూరు వెనుకబాటుతనం ముఖ్యమంత్రికి తెలియనిది కాదు

పాలమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబాటుతనం, ప్రజావీన పరిస్థితులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియనివి కావని పాలమూరు అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారిలు అన్నారు. ముఖ్యమంత్రికి వారు శనివారం బహిరంగ లేఖ రాశారు.

ఆ లేఖలో వారు పేర్కొన్న అంశాలిలా ఉన్నాయి. గత ప్రభుత్వాలు మహబూబ్‌నగర్ జిల్లాను వెనుకబాటు తనం నుంచి నిర్మాణాత్మకంగా ముందుకు నడిపించే విధానపరమైన చర్యలు అర్థవంతంగా చేపట్టలేదని పేర్కొన్నారు. తెలంగాణ సాధించుకున్నప్పటికీ గత ప్రభుత్వాల తప్పిదాల వల్ల మహబూబ్‌నగర్ జిల్లాకు కలిగిన మేలేమి లేదనే చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత పరిస్థితుల్లో మార్పు రావటానికి అవసరమైన ప్రత్యేకమైన కృషి మీ వల్ల జరుగుతుందని ఆశించినట్లు పేర్కొన్నారు. 2024 మార్చి 1న ప్రభుత్వం పౌరసమాజం ప్రతినిధుల సమావేశం జరిపినప్పుడు జలవనరుల కల్పన, చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దు, కొడంగల్, పాలెం ఓరియంటల్ కాలేజీల పునఃప్రారంభం కోసం మూడు ప్రాతినిధ్య లేఖలు అందజేసినట్లు తెలిపారు. జలవనరుల కల్పన కోసం కృష్ణా పరివాహక ప్రాంతంలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలు వందశాతం సాగునీటి హక్కుదారులైనప్పటికీ వివక్షతో నష్టమే మిగిలిందన్నారు.

ప్రతీ ఎకరాకు ఒక పంటకైనా సాగునీరివ్వటానికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రెండు భాగాలుగా విభజించి జూరాల ఎగువ నుంచి సగం, ప్రస్తుత పథకం నుంచి సగం నీరు తీసుకునే విధంగా చేపట్టాలన్నారు. ఆర్‌డీఎస్‌ను ఆధునికీకరించి నీరు సాధించాలన్నారు. చంద్రాసాగర్ నుంచి అమ్రాబాద్ ఎత్తిపోతల చేపట్టాలని, షాద్‌నగర్‌లో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించాలని కోరారు. తెలంగాణలో ఇథనాల్ కంపెనీల ఏర్పాటును ఉపసంహరించుకోవాలన్నారు. వెంటనే చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ మూసివేయాలని, ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, పర్యావరణం కాపాడాలన్నారు. పాలెం, కొడంగల్ ఓరియంటల్ కాలేజీలను ప్రభుత్వ నిర్వహణలో పునఃప్రారంభించాలన్నారు. ఈ ఓరియంటల్ కాలేజీలను తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించాలన్నారు. తెలుగు భాషా వికాసానికి ఆదర్శవంతమైన విధానం రూపొందించి అమలు పరచాలని ఆ లేఖలో వారు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..



దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

నుంచే సేవా కార్యక్రమాలు చేసేవాడిని. 2014 వరకు రాజకీయాల ఆలోచనే లేదు. తర్వాత కొంతమంది మిత్రులు సూచించడంతో 2015లో నిర్ణయం తీసుకుని, జీఎంఆర్ సేవా సమితి ప్రారంభించాం. కుటుంబ నేపథ్యం కూడా కాంగ్రెస్‌దే కావడం, ఆ ఐడియాలజీ నచ్చి చిన్నారెడ్డి, జైపాల్‌రెడ్డి గారి వద్దకు తీసుకెళ్లారు. వారితోపాటు మిత్రుడు సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి ప్రోత్సహించారు. 2018లో ఆశించినా దక్కలేదు. అయినప్పటికీ.. కష్టపడి పవన్‌కుమార్‌రెడ్డి కోసం పనిచేశాను. ఆ గుర్తింపుతో పోటీ చేసి గెలిచాను.

పార్టీలో తొందరగానే సమున్నత గౌరవం లభించింది కదా?

ఏదైనా మనకు ఇచ్చే టాస్క్‌ను సమర్థవంతంగా చేయడం బట్టి ఉంటుంది. అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సూచనలతో నిత్యం అందుబాటులో ఉండి, అప్పటి ప్రభుత్వ అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేశాను. మాజీ ఎమ్మెల్యే చేసే ఇసుక, నల్లమట్టి దందాలు, అక్రమ ఆస్తులపై పోరాటం చేశాను. బీఆర్ఎస్ హామీలను, వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాం. నిరుద్యోగ జంగ్ సైరన్‌ను 1.50 లక్షల మందితో విజయవంతం చేశాం. అచ్చంపేట నుంచి పాదయాత్ర, భారత్‌జోడో యాత్ర, తుక్కుగూడ, ఇంద్రవెల్లి సభలకు ప్రజలను తరలించాం. ఏ రోజూ డీసీసీ కావాలని అడగలేదు. పనిని గుర్తించి ఆ పదవి ఇచ్చారు. ఎన్నికల్లో పార్టీని సమర్థవంతంగా నడిపించి, హస్తం జెండా ఎగుర వేశాను. ఎమ్మెల్యే టికెట్ కూడా పని గుర్తించే ఇచ్చారు.

అభివృద్ధిలో మీ ప్రాథమ్యాలు ఎలా ఉన్నాయి?

నేను మొదటి నుంచీ విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరుపై ఎక్కువగా దృష్టి సారించాను. రానున్న రోజుల్లో వాటి లక్ష్యంగానే పని చేసుకుంటూ వెళ్తాను. ప్రతీవారం పనులపై రివ్యూ మీటింగ్స్ జరుగుతాయి. నిత్యం నియోజకవర్గంలో అందుబాటులో ఉంటున్నాను. విద్యకు సంబంధించి దేవరకద్రలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయించాను. వచ్చే సంవత్సరం అందుబాటులోకి వస్తుంది. డిగ్రీ కాలేజీ తెప్పించాను. క్లాసులు నడుస్తున్నాయి. వచ్చే ఏడాది సొంత భవన నిర్మాణం పూర్తిచేస్తాం. మండలానికో జూనియర్ కాలేజీ ప్రతిపాదనలు పెట్టాం. సీసీ కుంట కాలేజీకి భవనం మంజూరు చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను సీఎస్ఆర్ ఫండ్స్‌తో కల్పిస్తున్నాం. కొత్తకోటలో బాలికల పాఠశాలను మంజూరు చేయిస్తాను. త్వరలో దేవరకద్రకు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కూడా రాబోతోంది. రూ.110 కోట్ల రికార్డు నిధులతో కురుమూర్తి స్వామి గుట్టకు ఎలివేటెడ్ ఘాట్ రోడ్డు నిర్మించబోతున్నాం.

వైద్యరంగ అభివృద్ధి ఎలా ఉండబోతోంది?

ఎన్నికల ముందు దేవరకద్రలో 100 పడకలు, కొత్తకోటలో 30 పడకల ఆస్పత్రికి ఆర్థికశాఖ అనుమతులు లేకుండా జీవోలు తెచ్చారు. కానీ నేను ఆర్థిక శాఖ అనుమతితో జీవోలు తెచ్చి.. దేవరకద్రలో 100 పడకల ఆస్పత్రి, కొత్తకోటలో 50 పడకల ఆస్పత్రి నిర్మించబోతున్నాం. సబ్ సెంటర్ల అప్‌గ్రేడేషన్‌కు ప్రయత్నిస్తున్నాం. మందులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకుంటున్నాం. 65 కిలోమీటర్ల జాతీయ రహదారి ఉన్న దృష్ట్యా జానంపేట వద్ద ట్రామాకేర్ ఏర్పాటు చేయబోతున్నాం.

ఉపాధి రంగంపై ఎలాంటి దృష్టి పెట్టారు?

కేవలం ప్రభుత్వ ఉద్యోగాలనే కాకుండా యువతకు ఉపాధి కల్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి ఉన్న నేపథ్యంలో ఇండస్ట్రియల్ కారిడార్‌ను కోరాం. సీఎం సానుకూలంగా ఉన్నారు. అలాగే గుడిబండ వద్ద 400 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. రెండు జాతీయ రహదారుల మధ్య ఉండటంతో అక్కడ డ్రైపోర్టు ఏర్పాటు చేస్తే మూడు రాష్ట్రాలకు ఉపయోగపడుతుందని భావిస్తున్నాం. ఆ ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి.

ఆయకట్టును ఎలా పెంచబోతున్నారు.. ప్రణాళికలు ఏంటి?

ఇప్పుడు నీరందుతున్న ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలో నిర్మించినవే. పీఆర్ఎల్ఐ(పాలమూరు రంగారెడ్డి) కోసం రూ.28 వేల కోట్లు ఖర్చు చేసిన బీఆర్ఎస్.. ఒక్క గుంటకు కూడా నీరివ్వలేదు. కోయిల్‌సాగర్ కింద గతంలో 50 వేల ఎకరాలకు నీరిస్తామని, 10 వేల ఎకరాలకు ఇవ్వలేదు. రైతులను ఒప్పించి గ్రావిటీ కెనాల్స్‌ను పూర్తి చేయడం ద్వారా ఇప్పుడు 12 గ్రామాల్లోని 20 వేల ఎకరాలకు నీరందుతోంది. అజిలాపూర్ లిఫ్టు త్వరలో మంజూరు కాబోతోంది. చౌదర్‌పల్లి లిఫ్టు ద్వారా మన్యంకొండ గుట్టల్లో ఒక టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. వీటి ద్వారా 40 వేల ఎకరాలకు నీరందుతుంది. పేరూరును పునఃప్రారంభించాం. వచ్చే వర్షాకాలం వరకు లిఫ్టు పనులు పూర్తి చేస్తాం. శంకరసముద్రం ఆర్‌అండ్‌ఆర్ సమస్యపై కలెక్టర్, నేను నివేదిక పంపించాం. త్వరలో సమస్య పరిష్కరించి.. గ్రావిటీ ద్వారా 21 వేల ఎకరాలకు నీరందిస్తాం. కోయిల్‌సాగర్ పనులు ఐవీఆర్‌సీఎల్ కాంట్రాక్టు ఏజెన్సీకి రద్దు చేయించి, వేరే వారికి ఇచ్చాం. దీని ద్వారా 18 వేల ఎకరాలకు నీరందుతుంది. కరివెన కాల్వలకు భూసేకరణ చేయలేదు. ఆ భూసేకరణ చేసి, మిగిలిన పనులు పూర్తి చేస్తాం.

ప్రభుత్వ పథకాల అమలు తీరు ఎలా ఉంది?

ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతోంది. దేవరకద్రలో 60 వేల కుటుంబాలు ఉంటే 43 వేల కుటుంబాలకు ప్రతినెలా 1.26 కోట్లు ప్రభుత్వం బిల్లు చెల్లిస్తోంది. ఒక్క రుణమాఫీ మా నియోజకవర్గంలో రూ.197 కోట్లు అయ్యింది. మిగిలిన రుణమాఫీ త్వరలోనే అవుతుంది. రైతు భరోసా కింద కూడా పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కూడా ప్రారంభమవుతుంది.

క్రైం కార్నర్

తుంగభద్ర నదిలో మహిళ మృతదేహం లభ్యం



హారిక (ఫైల్)

అలంపూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అలంపూరు తుంగభద్ర నదిలో శనివారం మధ్యాహ్నం మహిళ మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవెల్లి మండలం బొంకూరు గ్రామానికి చెందిన హారికగా గుర్తించినట్లు ఉండవెల్లి ఎస్ఐ మహేష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం బొంకూరు గ్రామం నుంచి తప్పిపోయినట్లుగా వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా.. మరునాడు ఉదయం నదిలో శవంగా తేలింది. మృత దేహాన్ని గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరివేసుకొని గర్భిణి ఆత్మహత్య

నవాబ్‌పేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నవాబ్‌పేట మండలంలోని లోకిరేవు గ్రామానికి చెందిన ఎరుకలి శశికళ(26) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నవాబ్‌పేట ఎస్ఐ విక్రమ్ తెలిపిన వివరాల మేరకు... శశికళ చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో చిన్నమ్మ ఎరుకలి సరళ పెంచి పెద్ద చేసింది. ఎనిమిది సంవత్సరాల క్రితం లోకిరేవుకు చెందిన ఎరుకలి శివతో వివాహం జరిపించారు. వీరికి స్రవంతి, హారిక అనే ఇద్దరు కుమార్తెలుండగా, రెండు నెలల క్రితం అనారోగ్యంతో పెద్దకుమార్తె స్రవంతి మృతి చెందింది. కాగా శశికళ ప్రస్తుతం 8నెలల గర్భవతి. భర్త తాగుడుకు అలవాటుపడి జులాయిగా తిరుగుతుండటం, పెద్దకుమార్తె అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో మానసికంగా బాధపడుతుండేది.

ఆర్థిక ఇబ్బందులతో కల్లుకు అలవాటు పడిన శశికళ ఈ నెల 8న ఇంట్లో ఉన్న ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు పాల్పడిన సమాచారం శనివారం అందిందని, వెంటనే తన భర్తతో కలిసి లోకిరేవుకు వచ్చానని, శశికళ మృతిపై ఎలాంటి అనుమానాలు లేవంటూ పెంచి పెద్ద చేసిన చిన్నమ్మ ఎరుకలి సరళ ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

- ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల,బాలికల బాస్కెట్‌బాల్ టోర్నీలో భాగంగా శనివారం రెండో రోజు పోటీలను పాపిరెడ్డి హాజరై ప్రా రంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. టోర్నీలో క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎదగాలని ఆకాంక్షించారు.టోర్నీ రాష్ట్ర పరిశీలకుడు గోవర్దన్‌రెడ్డి, పీడీ ముకుర్రం, బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి సుభహన్ జీ, కోచ్ ఖలీల్, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణజ్యోతి, నాగరాజు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పాపిరెడ్డి

ఎస్జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ బాలబాలికల జట్టు ఎంపిక

జడ్చర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియను శనివారం జడ్చర్లలోని మినీస్టేడియంలో నిర్వహించారు. ఈ ఎంపికలో 80 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఒక్కో జట్టుకు క్రీడాకారులను ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. జడ్చర్లలో జరగబోయే 68వ ఎస్జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు పక్షాన పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో ఎస్జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మోయిన్, భానుకిరణ్, కృష్ణ, నరసింహారెడ్డి, నాగేశ్వర్, కిశోర్, రామకృష్ణ, రాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్ల మినీస్టేడియంలో ఎస్జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను చేపట్టిన నిర్వాహకులు

ఆలిండియా సౌత్‌జోన్ క్రీడా పోటీలకు బిజ్వార్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన బిజ్వార్ గ్రామ విద్యార్థులు

ఊట్కూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ని బిజ్వార్ గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థుల్లో ఆల్ ఇండియా సౌత్‌జోన్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. బిజ్వార్ గ్రామానికి చెందిన జి కమలాకర్, ఎస్.అశోక్, జి.సోనాళిక, బి.నిఖిత అనే నలుగురు విద్యార్థులు నారాయణపేట పట్టణంలోని ఎస్ఎల్‌డీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. శుక్రవారం పాలమూరు యూనివర్సిటీలో జరిగిన ఖోఖో జట్టు ఎంపికలో పాల్గొని ఉత్తమ ప్రతిభను చాటి పాలమూరు యూనివర్సిటీ జట్టులో ఎంపికయ్యారు. తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలో జరగబోయే ఆలిండియా సౌత్‌జోన్ క్రీడా పోటీల్లో పాలమూరు యూనివర్సిటీ తరఫున ఖోఖో పోటీల్లో పాల్గొననున్నారు. మండలంలోని బిజ్వార్ గ్రామం నుంచే ఏకంగా నలుగురు విద్యార్థులు ఎంపిక కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. బిజ్వార్ పాఠశాలలో చదువుతూ ఖోఖో క్రీడపై ఆసక్తి పెంచకుని జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి పోటీల్లో కూడా ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

హ్యాండ్‌బాల్‌లో రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ జట్లు

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 హ్యాండ్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు రన్నర్‌గా నిలిచాయి.

జిల్లా జట్లు రన్నర్‌గా నిలువడం పట్ల ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు జీయావుద్దీన్, ఆసీఫ్, బాలు అభినందించారు.

ఫైనల్‌కు చేరిన మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జట్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల,బాలికల బాస్కెట్‌బాల్ టోర్నీ హోరాహోరీగా కొనసాగుతున్నది. శనివారం జరిగిన మ్యాచ్‌లో బాలుర విభాగంలో జరిగిన సెమీఫైనల్ హైదరాబాద్ జట్టు కరీంనగర్‌పై 26-20, రెండో సెమీఫైనల్ రంగారెడ్డి జట్టు వరంగల్‌పై 33-11 స్కోర్ తేడాతో గెలిచి హైదరాబాద్, రంగారెడ్డి జట్లు ఫైనల్ చేరాయి. బాలికల విభాగంలో జరిగిన మొదటి సెమీఫైనల్‌లో హైదరాబాద్ జట్టు రంగారెడ్డిపై 34-10 గెలిచింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్ మహబూబ్‌నగర్ జట్టు ఖమ్మంపై 28-26 స్కోర్ తేడాతో గెలిచింది. బాలికల విభాగంలో హైదరాబాద్, మహబూబ్‌నగర్ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం ఫైనల్‌లో జట్లు తలపడనున్నాయి.



సెమీస్‌లో తలపడుతున్న మహబూబ్‌నగర్, ఖమ్మం బాలికల జట్లు

అంతర్జాతీయ వైద్య సదస్సులో వైద్యుడికి అరుదైన గౌరవం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇండోనేషియాలోని బాలిలో జరిగిన అంతర్జాతీయ వైద్య సదస్సులో ఎస్వీఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఊపిరితిత్తుల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఈ మేరకు శనివారం నిర్వహించిన ఈ సదస్సులో భారతదేశం నుంచి ఒకే ఒక్క వైద్యుడికి చిన్న పిల్లల్లో ఊపిరితిత్తుల శస్త్రచికిత్స గురించి మాట్లాడే అవకాశం లభించింది.

ఆయన చిన్నపిల్లల్లో ఊపిరితిత్తులకు వచ్చే వ్యాధులు, వాటికి అందించే వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సలపై ప్రజెంటేషన్ ఇవ్వడంతో పాటు ప్రసంగించారు. ఆయన ప్రసంగంపై పలు దేశాల నుంచి వచ్చిన వైద్య నిపుణులు కరతాలధ్వనులతో అభినందనల వర్షం కురిపించారు. అదేవిధంగా ఎస్వీఎస్ రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, ఊపిరితిత్తుల విభాగాధిపతులు డాక్టర్ ప్రద్యుత్ వ్యాగ్రే, వి.కోటేశ్వర్‌రావులు అభినందించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు

గద్వాల క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మోటార్‌బైక్‌పై వచ్చి మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లిన సంఘటన శనివారం తెల్లవారుజామున గద్వాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శోభ అనే మహిళ తెల్లవారుజామున ఇంటి సమీపంలో ఉండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దొంగలు ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

కల్వకుర్తిటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం ఏర్పడుతుందని మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 10వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం జిల్లా స్థాయి ఎంపికలో పాల్గొని మాట్లాడారు. వచ్చే నెల 1వ తేదీన మంచిర్యాల జిల్లాలో ఉషోదయ హైస్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అండర్ 8, 10, 12 విభాగాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 250మంది విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల హెచ్‌ఎం బాలునాయక్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పరశురామ్, పీఈటీ ప్రసాద్, మునిసిపల్ వైస్‌చైర్మన్ షాహేద్, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, నాయకులు తాహేర్‌అలీ, రాజు, రవి, వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

శ్రీశైలం వెళ్లిన టూరిజం లాంచీ

కొల్లాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సోమశిల నుంచి శ్రీశైలం వరకు రెండవసారి టూరిజం లాంచీ శనివారం బయలుదేరింది. లాంచీ ప్రయాణం ఏర్పాట్లను శనివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సైదులు, కొల్లాపూర్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ పర్యవేక్షించారు. సోమశిల నుంచి శ్రీశైలం వరకు కృష్ణానదిలో లాంచీలో ప్రయాణిస్తూ కృష్ణానది అందాలను తిలకిస్తూ చుట్టూ ఎత్తైన గుట్టలను చూస్తూ పర్యాటకులు లాంచీ ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నారు.

ప్రతీ శనివారం కృష్ణానది వద్ద టూరిజం లాంచీ సౌకర్యం అందుబాటులో ఉంటుందని ఏజీఎం సైదులు పేర్కొన్నారు.



సోమశిల నుంచి శ్రీశైలం వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న టూరిజం లాంచీ

నేడు కురుమూర్తికి సీఎం రేవంత్‌రెడ్డి రాక

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. కాగా, సీఎం రోడ్డు మార్గంలో హైదరాబాద్ నుంచి కొత్తకోట మీదుగా కురుమూర్తికి రానున్నారు.

భక్తులకు ఆంక్షలు లేవు

ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదివారం ఉదయం 10 గంటలకు ఆలయానికి రానున్నారని చెప్పారు. అందుకోసం ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. ఆలయం గుట్టపైకి రూ.110 కోట్లతో మంజూరైన ఎలివేటెడ్ కారిడార్‌తో కూడిన ఘాట్ రోడ్డు నిర్మాణానికి సీఎం భూమిపూజ చేస్తారని తెలిపారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని, గుట్టకింద ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. సీఎం రాక సందర్భంగా భక్తులకు ఎలాంటి ఆంక్షలు లేవని, యధావిధిగా స్వామి వారిని దర్శించుకోవచ్చని తెలిపారు. దుకాణాలు కూడా తెరుచుకొని ఉంటాయన్నారు. సమావేశంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, నాయకులు వట్టెం శివకుమార్, గూడూరు శేఖర్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణలో 243 కులాలు

(మొదటిపేజీ తరువాయి)

సమాచారంతోపాటు ఆయా కుటుంబాల భూముల వివరాలు, వారికి ఎదురవుతున్న భూ సమస్యలపైనా ఆరా తీస్తోంది. వ్యాపారవేత్తలైతే.. వారి వార్షిక టర్నోవర్ వివరాలు అడుగుతోంది. ఇక ప్రార్థనాలయాలకు వెళ్లే విషయంలో కులపరమైన వివక్ష ఎదురవుతోందా? అని కూడా తెలుసుకుంటోంది. రాష్ట్రంలో శనివారం ప్రారంభమైన కులగణన ప్రశ్నావళిలో ఎన్యుమరేటర్లు ఈ వివరాలన్నింటినీ సేకరిస్తున్నారు. కులాల జాబితాకు సంబంధించి.. ఎస్సీల్లో ఆది ఆంధ్ర నుంచి వల్లువాన్ వరకు మొత్తం 59 కులాలు ఉన్నట్లు, ఎస్టీల్లో అంధ్ నుంచి నక్కల కుర్వికరణ్ వరకు కలిపి 32 కులాలు ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది బీసీ జాబితాలో అన్ని కేటగిరీల్లో కలిపి 134 కులాలు ఉన్నట్లు తెలిపింది. వీటిలో.. బీసీ-ఏ కేటగిరీలో 57 కులాలు, బీసీ-బీలో 27 కులాలు, బీసీ-సీలో 01, బీసీ-డీలో 35, బీసీ-ఈలో 14 కులాల చొప్పున ఉన్నాయి. వీరితోపాటు అనాథలు, పదేళ్ల వయసు రాకముందే తల్లిదండ్రులను కోల్పోయి నిరాశ్రయులైన పిల్లలను బీసీ-ఏ కేటగిరీ కింద నమోదు చేయాలని పేర్కొంది. వీరి కోసం ప్రధాన కాలమ్‌లో కులం కోడ్ కింద 044ను కేటాయించింది. కాగా, క్రిస్టియన్ మతంలోకి మారిన షెడ్యూల్ కులాల (ఎస్సీలు) వారితోపాటు వారి సంతానాన్ని బీసీ-సీలో నమోదు చేస్తున్నారు.

ఓసీల్లో 18 కులాలు..

ఓపెన్ కేటగిరీ (ఓసీ)లో మొత్తం 18 కులాలున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. బీసీ-సీలో లేని క్రిస్టియన్లు, బీసీ-ఈలో లేని ముస్లింలను కూడా ఓసీ జాబితా కింద ఉంచారు. వీరికి ప్రత్యేక కోడ్‌లను కేటాయించారు. వీరే కాకుండా.. జైనులు, బౌద్ధులు, లింగాయత్, మార్వాడీ, పట్నాయక్, సిక్కులు, వర్మలు కూడా ఓసీ జాబితాలోనే ఉన్నారు. ఇంకా ఎవరైనా ఇతరులుంటే వారి కోసం '000'ను కోడ్‌గా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు ప్రభుత్వం సూచించింది. వివరాల సేకరణకు వెళ్లిన ఎన్యుమరేటర్లు.. ఆయా కుటుంబసభ్యులు చెప్పిన కులాన్ని బట్టి సంబంధిత కోడ్‌ను నమోదు చేస్తున్నారు. తెలంగాణలో ఉంటున్న స్థానికేతరులైతే.. వారు ఏ రాష్ట్రానికి చెందిన వారనే వివరాలను నమోదు చేసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు కోడ్‌లను కేటాయించారు. ఇక రాష్ట్రంలోని కుటుంబాలు, ఆయా కుటుంబాల్లోని వ్యక్తులు ఏ భాష మాట్లాడుతారనే వివరాల కోసం తెలుగు సహా మొత్తం 18 భాషలకు కోడ్‌లను ప్రశ్నావళిలో కేటాయించారు. అంతేకాకుండా.. కులపరమైన వివక్ష, బెదిరింపులు, ఆయా మతాల ప్రార్థనాలయాలకు వెళ్లే అంశాలను కూడా కులగణనలో తెలుసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి ప్రశ్నావళిలో ప్రత్యేక ప్రశ్నలను పొందుపరిచారు. ప్రశ్నావళి షెడ్యూల్ కాలమ్ సంఖ్యలో 56వ ప్రశ్నలో 'ఎలాంటి బెదిరింపులు, వివక్ష లేకుండా మీ కుటుంబంలోని సభ్యులు స్థానిక దేవాలయాలకు, మసీదులకు, చర్చిలు, ప్రార్థనా మందిరాలకు స్వేచ్ఛగా వెళ్లగలుగుతున్నారా?'అని ప్రశ్నిస్తున్నారు.

భూ సమస్యలపైనా వివరాల సేకరణ..

కుటుంబ సభ్యుల భూముల వివరాలను నమోదు చేసే క్రమంలో భూములకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తెలుసుకుంటున్నారు. ఆయా సమస్యలను నమోదు చేసేందుకూ కోడ్‌లను కేటాయించారు. వీటిలో "వారసత్వం లేదా మ్యుటేషన్ సమస్యలు, పట్టా ఉంది కానీ దానిలో వివరాలు తప్పుగా వచ్చాయి, ధరణి వల్ల వచ్చిన పట్టా సమస్య, పట్టా ఉన్నా భూమి ఇతరుల అక్రమ ఆధీనంలో ఉంది, అసైన్డ్ భూమి ఇచ్చారు కానీ పట్టా ఇవ్వలేదు, ఇదే భూమిపై సర్వే జరిగినా అటవీ హక్కు పత్రం(పట్టా) ఇవ్వలేదు, ప్రభుత్వ భూమి సాగు చేస్తున్నాం, అసైన్డ్ పట్టా కోరుతున్నాం, ఇతరములు" లాంటి ప్రశ్నలకు వివరాలను కోడ్‌ల వారీగా నమోదు చేస్తున్నారు. వ్యాపారం, రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నవారు, పారిశ్రామికవేత్తల నుంచి వారి వార్షిక టర్నోవర్ వివరాలను తెలుసుకొని నమోదు చేస్తున్నారు. ఇక కాంట్రాక్టర్, బిల్డర్, సినిమా నిర్మాత, దర్శకులు, నటీనటులు, క్రీడాకారులు సహా వివిధ పనులు చేసే వారి వివరాలను ప్రశ్నావళిలోని స్వయం ఉపాధి అనే కాలమ్‌లో ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. సంగీత, వాయిద్య, నాటక, గానం, నృత్యం, చిత్రకారులను కళాకారుల కింద, వాస్తు, జ్యోతిష్యం, మతపరమైన సేవలు, పురోహితులు, మౌలానా, చర్చి పాస్టర్.. ఇలా అన్ని వివరాలకూ ప్రత్యేక కోడ్‌లను కేటాయించారు.

అప్పులు చెబుతున్నారు కానీ..!

రాష్ట్రంలో శనివారం ప్రారంభమైన కులగణనలో ఆసక్తికర ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రశ్నావళిలో ఉన్న అన్ని ప్రశ్నలకు ఆయా కుటుంబ పెద్ద, సభ్యులు సమాధానం చెబుతున్నప్పటికీ.. ధరణి పాస్‌బుక్, ఆధార్ నంబర్లు చెప్పేందుకు కొంత వెనకాడుతున్నారు. అయితే తమ కుటుంబానికి ఎంత అప్పు ఉందనే ప్రశ్నకు మాత్రం వెంటనే సమాధానం చెబుతున్నట్టు తెలిసింది. ధరణి, ఆధార్ నంబర్లు చెబితే తమ ఆస్తుల వివరాలన్నీ ప్రభుత్వానికి తెలిసిపోతాయని, ప్రభుత్వ పథకాలేవీ తమకు దక్కవనే అపోహలో కొంతమంది ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని తొలగించేందుకు ప్రభుత్వం చేపట్టిన కులగణన ఎందుకు, దాని ఉపయోగాలు ఏంటనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమగ్ర ఇంటింటి సర్వే షురూ

కుటుంబ వివరాలిచ్చిన గవర్నర్.. మంత్రులు దామోదర, పొన్నం కూడా

- పలు చోట్ల సర్వే బహిష్కరణ.. అధికారుల అడ్డగింత
- కలెక్టర్లు ఎన్యుమరేటర్ల సందేహాలు నివృత్తి చేయాలి
- సర్వేలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనేలా చూడండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి
- సర్వేపై నమ్మకంగా ఉండండి: మంత్రులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా శనివారం సమగ్ర ఇంటింటి సర్వే ప్రారంభమైంది. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తమ కుటుంబ సభ్యుల వివరాలను అందజేశారు. సమగ్ర ఇంటింటి సర్వేపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని మంత్రులు సూచించారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకున్నారు. మరికొన్ని చోట్ల ప్రజలు సర్వేను బహిష్కరించారు. తమ సమస్యలను పరిష్కరిస్తేనే సర్వేకు సహకరిస్తామని ఎన్యుమరేటర్లకు స్పష్టం చేశారు. సమగ్ర ఇంటింటి సర్వే ప్రారంభమైనందున కలెక్టర్లు తమ జిల్లాల్లోని ఎన్యుమరేటర్లతో మాట్లాడుతూ సందేహాలను నివృత్తి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. కుటుంబ సర్వేపై శనివారం ఆయన జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటింటి సర్వేపై ప్రజలు అనేక సందేహాలు వ్యక్తం చేస్తుంటారని.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ఎన్యుమరేటర్లతో మాట్లాడితే, ఆ సందేహాలను నివృత్తి చేయవచ్చని భట్టి చెప్పారు. అవసరమైతే ఉన్నతాధికారుల నుంచి కలెక్టర్లు స్పష్టత తీసుకోవాలన్నారు. ఏ చిన్న విషయాన్ని నిర్లక్ష్యం చేయరాదని, ఎలాంటి సందేహాలనైనా నివృత్తి చేయడానికి ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఇతర ఉన్నతాధికారులు సిద్ధంగా ఉంటారని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సాధ్యమైనంత ఎక్కువ సార్లు సర్వేలో భాగస్వాములయ్యేలా చూడాలన్నారు.

గవర్నర్ కుటుంబ వివరాల సేకరణ

రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కుటుంబ వివరాలను అధికారులు సేకరించారు. గవర్నర్ స్వయంగా తెలిపిన వివరాల్ని ఫాంలో నమోదు చేసుకున్నారు. ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమగ్ర ఇంటింటి సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోకూడదని, నమ్మకంతో వివరాలను ఇవ్వాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సిహ చెప్పారు. సంగారెడ్డిలోని విద్యానగర్‌లో తన ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్లకు కుటుంబ వివరాలు అందజేశారు. సర్వేకు ప్రజలంతా సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. బంజారాహిల్స్, మినిస్టర్స్ కాలనీలోని మంత్రి నివాసంలో ఆయన కుటుంబ వివరాలను సేకరించిన తర్వాత ఎన్యుమరేటర్లు స్టిక్కర్లు అతికించారు.

కరీంనగర్ జిల్లాలో పూర్తికాని స్టిక్కరింగ్

కరీంనగర్ నగర పాలక సంస్థతో పాటు సమీపంలోని కొన్ని గ్రామాల్లో శనివారం సాయంత్రం వరకూ స్టిక్కరింగే పూర్తి కాలేదు. దీంతో జిల్లాలో కుటుంబాల సంఖ్య తేలలేదు. అధికారులు ఈ విషయమై ఎలాంటి ప్రకటనా చేయలేదు. స్టిక్కరింగ్ చేసిన ప్రాంతాల్లో సర్వే సమాచారాన్ని సేకరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అంతటా సర్వే ఆలస్యంగా ప్రారంభమైంది. సకాలంలో సర్వే పత్రాలు అందకపోవడంతో కొన్ని గ్రామాల్లో మధ్యాహ్నం 12 గంటలకు, మరికొన్ని గ్రామాల్లో 3 గంటలకు సర్వే ప్రారంభించారు. జగిత్యాల జిల్లాలో తొలి రోజు 2.58శాతం సర్వే పూర్తి చేశారు. పెద్దపల్లి జిల్లాలో 1,849మంది ఎన్యుమరేటర్లు 13,649కుటుంబాల సర్వే పూర్తి చేశారు. గ్రామ సరిహద్దులు మార్చే వరకు సర్వేను బహిష్కరిస్తున్నట్లు రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లె గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి వచ్చిన అధికారులకు వినతిపత్రం అందించారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు తాము సర్వేకు సహకరించబోమని తెలిపారు.



కులగణనలో భాగంగా పొన్నం నివాసంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

దండం పెట్టి.. ఇంటికి రప్పించి..

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అన్నవరంలో సర్వేను పరిశీలించేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా స్పెషల్ ఆఫీసర్ (ఐఏఎస్) సురేంద్రమోహన్ వెళ్లారు. గ్రామానికి చెందిన వృద్ధుడు బత్తుల లక్ష్మయ్య ఆయనకు దండం పెట్టి తనకు ఇల్లు కావాలని వేడుకున్నాడు. ఆయన్ను తన గుడిసె వద్దకు తీసుకెళ్లాడు. తినడానికి తిండి లేదని, ఇబ్బందులు పడుతూ జీవిస్తున్నాని, ఇల్లు మంజూరు చేయాలని కోరాడు. స్పందించిన అధికారి.. వృద్ధుడి ఆధార్‌ను సెల్‌ఫోన్ ద్వారా ఫొటో తీసుకున్నారు. సర్వేలో సమాచారం ఇస్తే నిబంధనల ప్రకారం ఇల్లు వస్తుందని భరోసా ఇచ్చారు.

ఇథనాల్ పరిశ్రమను తరలిస్తేనే..

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లిలో ప్రజలు సర్వేను బహిష్కరించారు. ఇథనాల్ పరిశ్రమను తరలిస్తేనే సర్వేకు సహకరిస్తామని తేల్చిచెప్పారు. స్పందించిన నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, డీపీవో శ్రీనివాస్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఇతర అధికారులు గుండంపల్లి గ్రామానికి వచ్చారు. గ్రామస్థులు వారిని పొలిమేరల్లోనే అడ్డుకొని, నిరసన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా రాని అధికారులు ఇప్పుడెందుకు వచ్చారంటూ నిలదీశారు. ఇథనాల్ పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించాకే తమ గ్రామంలోకి రావాలని డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే సర్వేకు సహకరిస్తామని తేల్చిచెప్పారు. దీంతో అధికారులు చేసేదేమీ లేకవెనుదిరిగి వెళ్లిపోయారు.

రంగంలోకి ప్రత్యేక కమిషన్

రేపు, ఎల్లుండి అభిప్రాయ సేకరణ... త్వరలో జిల్లాల్లో

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక (డెడికేటెడ్) కమిషన్ రంగంలోకి దిగనుంది. ఈ మేరకు రేపు, ఎల్లుండి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభిప్రాయ సేకరణ(పబ్లిక్ హియరింగ్) కార్యక్రమాన్ని నిర్వహించనుంది. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని దామోదర సంజీవయ్య తెలుగు సంక్షేమ భవన్‌లోని 4వ అంతస్తులో ఏర్పాటైన కమిషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అయితే, సోమవారం ఎవరైనా వచ్చి తమ అభిప్రాయాలను కమిషన్‌కు వెల్లడించేందుకు అవకాశం కల్పించగా.. మంగళవారం మాత్రం వివిధ ఎన్జీవోలు, పలు సంస్థలు, కుల సంఘాలకే అవకాశం కల్పిస్తున్నట్లు కమిషన్ కార్యదర్శి బి.సైదులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, త్వరలోనే ఈ పబ్లిక్ హియరింగ్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల వారీగా నిర్వహించనున్నట్లు తెలిసింది. మరోవైపు రాష్ట్రంలో కులగణన సర్వే ప్రారంభమైన విషయం తెలిసిందే. వివరాల సేకరణ అనంతరం ప్రత్యేక కమిషన్ బీసీల రిజర్వేషన్లను ఖరారు చేస్తుంది.

కులగణనపై బీజేపీ వైఖరేంటి?: పొన్నం

- కేటీఆర్ కాపలా కుక్కలా అమోయ్‌కుమార్: మల్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కులగణనపై బీజేపీ వైఖరేంటో స్పష్టం చేయాలని.. అనుకూలమా లేక వ్యతిరేకమా అన్నది ఆ పార్టీ నేతలు తేల్చి చెప్పాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బీసీ సామాజిక వర్గం నుంచి వచ్చిన బీజేపీ ఎంపీ లక్ష్మణ్.. బీసీ వర్గాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శనివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో పొన్నం మాట్లాడుతూ.. బిహార్‌లో కులగణన చేసిన నితీశ్ ప్రభుత్వాన్ని, కులగణనపై మహారాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన ఉద్ధవ్ ఠాక్రే సర్కారును కూలగొట్టింది.. ఝార్ఖండ్‌లో బీసీ రిజర్వేషన్‌ను 27 శాతానికి పెంచితే గవర్నర్ సంతకం కాకుండా ఆపింది బీజేపీ కాదా ప్రశ్నించారు. కులగణనకు కేంద్రంపై ఒత్తిడి తెస్తారా.. లేక బలహీన వర్గాల ద్రోహిగా మిగులుతారా అన్నది రాష్ట్ర బీజేపీ నేతలు తేల్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ సమగ్ర కుటుంబ సర్వేలాగా దీన్ని గోప్యంగా ఉంచబోమని తెలిపారు. కేటీఆర్‌కు కాపలా కుక్కలా పని చేసిన ఐఏఎస్ అమోయ్‌కుమార్ రంగారెడ్డి జిల్లా ప్రజలను నిండా ముంచాడని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మూసీ నీళ్లు తాగిస్తే కానీ కేటీఆర్, హరీశ్‌రావుకు బుద్ధి రాదన్నారు. 'సన్నాసుల్లారా.. మహాత్మాగాంధీతో కేసీఆర్‌ను పోలుస్తారా? కేసీఆర్ గాంధీ కాదు గాడ్సే.. మీలాగా సీఎం రేవంత్ చిల్లర మాటలు మాట్లాడలేదు' అంటూ వ్యాఖ్యానించారు. పదేళ్ల పాటు అబద్ధాలతో పబ్బం గడిపిన బీఆర్ఎస్ నేతలు.. మళ్లీ ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపుతున్నారని మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి ఫైర్ అయ్యారు. ఇంటికో ఉద్యోగం, రూ.లక్ష రుణమాఫీ అమలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, జిల్లాకొక మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తామన్న హామీలు ఏమేరకు అమలు చేశారని నిలదీశారు.

30 ఏళ్లు పని చేసిన సిబ్బంది హక్కులను కాదనలేరు: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దాదాపు 30 ఏళ్ల పాటు సేవలు అందించిన నాలుగో తరగతి ఉద్యోగుల హక్కులను ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు కాలరాయలేవని హైకోర్టు వ్యాఖ్యానించింది. తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్‌లో 30 ఏళ్ల సుదీర్ఘ సర్వీసును పూర్తిచేసుకున్నప్పటికీ రెగ్యులరైజ్ చేయకపోవడం వారి హక్కులను నిరాకరించడం కిందకే వస్తుందని పేర్కొంది. ఇప్పటికీ సర్వీసులో ఉన్న 47మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఆదేశించింది. రిటైర్ అయిన, చనిపోయిన ఉద్యోగులకు సర్వీసు అనంతర పెన్షనరీ బెనిఫిట్స్ అందజేయాలని స్పష్టం చేసింది.

ఏడేళ్లయినా స్వీపర్ జీతం ఇవ్వరా?

సూర్యాపేట జిల్లా చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేసిన ఉద్యోగికి వేతనం చెల్లించాలని 2017లో ఇచ్చిన ఉత్తర్వులు అమలుకాకపోవడంపై జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. 27వ తేదీ నాటికి సమస్య పరిష్కారం కాకపోతే హోంశాఖ ముఖ్యకార్యదర్శి తమ ఎదుట ప్రత్యక్షంగా హాజరుకావాలని స్పష్టంచేసింది.

అప్పుల బాధతో చేనేత దంపతుల బలవన్మరణం

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన

సిరిసిల్ల క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక చేనేత దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. సిరిసిల్ల పట్టణం వెంకంపేటలోని మైసమ్మ వీధిలో నేత కుటుంబానికి చెందిన భైరి అమర్ (45), స్రవంతి (40) దంపతులు నివాసం ఉంటున్నారు. భైరి అమర్‌కు నాలుగు జోడీల సాంచెలు ఉండగా వాటి ద్వారా బెడ్ షీట్లు నేసి విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా వస్త్ర పరిశ్రమలో సంక్షోభం కారణంగా అమర్‌కు పనిలేకుండా పోయింది. అంతకుముందే ఇల్లు కట్టుకునేందుకు బ్యాంకు రుణం తీసుకోవడంతో 25 లక్షల వరకు అప్పులయ్యాయి. వస్త్ర పరిశ్రమ నిలిచిపోవడంతో అమర్ తన సాంచలు అమ్మేశాడు. అయినా అప్పు తీరలేదు. దీంతో మనస్తాపం చెందిన దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు.

దిగుబడి తగ్గిందని ఇద్దరు రైతుల ఆత్మహత్య

- వరంగల్, సిరిసిల్ల జిల్లాల్లో ఘటనలు

వర్ధన్నపేట రూరల్, ఎల్లారెడ్డిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అప్పులు తెచ్చి సాగు చేసిన వరి పంట సరైన దిగుబడి రాదన్న భయంతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు వరంగల్, సిరిసిల్ల జిల్లాల్లో జరిగాయి. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని చంద్రు తండా శివారు జగ్నా తండాలో జరిగింది. రైతు బానోతు మైబూ (35) ఈఎంఐలో కొనుగోలు చేసిన ట్రాక్టర్ కిస్తీలు కట్టలేక మథనపడేవాడు. దీనికి పంట దిగుబడి తగ్గడంతో అప్పులు తీర్చలేనన్న భయంతో ఈ నెల 7న పొలంలో పురుగు మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 8న రాత్రి మృతి చెందాడు. అలాగే, సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట మండలం చింతకుంట తండాకు చెందిన బలరాంనాయక్ ఉపాధి నిమిత్తం రూ.8లక్షలు అప్పు చేసి గల్ఫ్ దేశానికి వెళ్లాడు. అక్కడ పనులు లేక ఏడాది క్రితం తిరిగొచ్చాడు. రూ.1 లక్ష అప్పు చేసి వరిసాగు చేయగా, పంటకు తెగుళ్ల సోకాయి. వారం క్రితం పంటను కోసి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాడు. అయితే, దిగుబడి తగ్గిందన్న ఆవేదనతో శనివారం ఉరేసుకున్నాడు.

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

- మృతి చెందిన నలుగురు తెలంగాణ వాసులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు

తాండూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులు మృతి చెందారు. ఈ సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన రాఘవకృష్ణ(55), సంగీత(45) దంపతులతో పాటు రాఘవేందర్(28), భాను ప్రసాద్ కారులో శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలో గానుగాపూర్ వెళుతున్నారు. మార్గంమధ్యలో గుల్బర్గా వద్ద గల కమలాపూర్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం వీరి కారును వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో రాఘవకృష్ణ, సంగీత దంపతులు, రాఘవేందర్, భాను ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్, మల్టీజోన్ ఐజీపీ సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు తాండూరు మండలం కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుల కుటుంబానికి ఎస్ఐ దగ్గరుండి సహాయం అందించారు. అయితే వీరు హైదరాబాద్ వాసులా? లేక వనపర్తి వాసులా? అనేది తేలాల్సి ఉంది.

దొంగలతో జట్టుకట్టి ప్రాణాలు కోల్పోయిన మాజీ పోలీసు

డబ్బు వివాదం.. కారుతో ఢీకొట్టి హత్యాయత్నం

9 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈజీ మనీ కోసం దొంగలతో జట్టుకట్టి ఉద్యోగం కోల్పోయిన ఆ పోలీసు, డబ్బు పంపకాల్లో తేడా వచ్చి వారి చేతిలోనే దారుణహత్యకు గురయ్యాడు. సరూర్‌నగర్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సీఐ సైదిరెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన ఈశ్వర్ (38) ఉమ్మడి రాష్ట్రంలో 2010లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. బేగంపేట, ఎస్సార్‌నగర్, చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లతో పాటు టాస్క్‌ఫోర్స్ విభాగంలో విధులు నిర్వర్తించాడు. అంతటా క్రైమ్ విభాగంలో పనిచేయడంతో నేర వ్యవస్థపై పట్టు సాధించాడు. సెల్‌ఫోన్ దొంగలతో దోస్తీ పెంచుకుని, దొంగ సెల్‌ఫోన్లు ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారో తెలుసుకున్నాడు. వారిచ్చిన సమాచారంతో దొంగ సెల్‌ఫోన్ కొనుగోలుదారులను బెదిరించి డబ్బులు వసూలు చేయడానికి అలవాటుపడ్డాడు. సెల్‌ఫోన్ దొంగతనాల ఫిర్యాదులు సేకరించి, వాటిల్లోని ఐఎంఈఐ నంబర్ల ఆధారంగా సెల్‌ఫోన్‌లను గుర్తించేవాడు. ఆ సెల్‌ఫోన్లు వాడుతున్న వారికి ఫోన్ చేసి బెదిరించి వాటిని రికవరీ చేసి, విక్రయించి సొమ్ముచేసుకునేవాడు. మరింత సొమ్మును కూడబెట్టేందుకు జేబుదొంగలు, స్నాచర్‌లతో ఈశ్వర్ జట్టుకట్టాడు. ఉమ్మడి రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన దొంగలు, స్నాచర్‌లతో ముఠా ఏర్పాటు చేసి ప్రధాన ప్రాంతాల్లో దొంగతనాలు, స్నాచింగ్‌లు చేయించసాగాడు. కాగా ఓ దొంగతనం కేసులో రెండేళ్ల క్రితం నల్లగొండ పోలీసులు ఈశ్వర్‌ను అరెస్ట్ చేశారు. ఈశ్వర్ ముఠా లీలలు వెలుగులోకి రావడంతో సీరియస్‌గా తీసుకున్న పోలీసు ఉన్నతాధికారులు అతడిని సర్వీసు నుంచి తొలగించారు. ఇటీవల ఈశ్వర్‌కు దొంగల ముఠాలతో విభేదాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. నగరంలో తనకు తెలియకుండా, తనకు కమీషన్ ఇవ్వకుండా ఇతరులెవరూ దొంగతనాలు చేయకుండా ఈశ్వర్ అడ్డుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కొంత మంది దొంగల ముఠాల నాయకులు ఈశ్వర్‌పై కక్ష పెంచుకున్నారు. గత కొన్ని రోజులుగా కొండాపూర్ హఫీజ్‌పేటకు చెందిన శంకర్‌తో, ఈశ్వర్‌కు వివాదం కొనసాగుతోంది. ఈ విషయమై చర్చించుకునేందుకు ఈశ్వర్ బంధువైన బోడుప్పల్‌కు చెందిన విజయ్, సరూర్‌నగర్‌కు చెందిన రంజిత్, రామస్వామిలు గత నెల 31న కర్మన్‌ఘాట్‌లో ఈశ్వర్, శంకర్‌లకు మీటింగ్ ఏర్పాటు చేశారు. వీరంతా ఆ రోజు మధ్యాహ్నం 1.30కు ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు వచ్చారు. అక్కడ కూర్చుని వివాదంపై చర్చిస్తూ మద్యం సేవించారు. చర్చలు కొలిక్కి రాకపోవడంతో ఈశ్వర్, శంకర్‌తో పాటు విజయ్, రంజిత్, రామస్వామి, మరొక వ్యక్తి కలిసి బార్ నుంచి బయటకొచ్చారు. అక్కడ శంకర్ ఈశ్వర్‌లకు మరొకసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో శంకర్ బెలెనో కారుతో ఈశ్వర్‌ను ఢీ కొట్టాడు. కిందపడిపోయిన ఈశ్వర్ నుంచి మరొకసారి కారు తీసుకవెళ్లి, అక్కడి నుంచి పారిపోయారు. రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉన్న ఈశ్వర్‌ను స్థానికులు వెంటనే ఎదురుగా ఉన్నటువంటి ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 9 రోజుల తర్వాత మృతి చెందాడు. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తుల ప్రమేయం ఉందని గుర్తించిన పోలీసులు, నిందితుల కోసం గాలిస్తున్నారు.

మా ప్లాట్లపై కన్నేశాడు!

మంత్రి బంధువునంటూ రౌడీలతో బెదిరింపులు.. సుప్రీంకోర్టులోనూ గెలిచాం

- అయినా రెండుసార్లు గదులు, ప్రహరీ కూల్చివేయించాడు
- రక్షణ కల్పించాలన్న సోమలింగేశ్వర నగర్ బాధితులు



తమ వద్ద ఉన్న పత్రాలు, ఫొటోలు ప్రదర్శిస్తున్న బాధితులు

పంజాగుట్ట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పైసా పైసా కూడబెట్టి కొనుక్కున్న తమ ప్లాట్లను నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ మంత్రి బంధువునని చెబుతున్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేయాలని చూస్తున్నాడని హయత్ నగర్‌లోని సోమలింగేశ్వర నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది. సుమారు రూ.150 కోట్ల విలువ చేసే 101 ప్లాట్లపై ఆ కబ్జాదారు కన్నుపడిందని, రెండుసార్లు గదులు, ప్రహరీ గోడ కూల్చివేయించాడని, రౌడీలతో భయపెడుతున్నాడని పేర్కొంది. హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తమకు, తమ ప్లాట్లకు రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు టీ చంచల్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంవీ రావు, కోశాధికారి వై.కృష్ణమూర్తి, బాధితులు సుధారాణి, మూర్తిరాజు తదితరులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. బాగ్ హయత్ నగర్‌లోని సర్వే నం.180, 187లలో ఉన్న సుమారు 9.20 ఎకరాల్లో పట్టాదార్లు జల్లా భిక్షపయ్య, ఆయన కుమారులు, జల్లా అచ్చిలింగం,రిజిస్టర్డ్ జీపీఏ హోల్డర్ జల్లా అయిలు 101 ప్లాట్లు ఏర్పాటుచేసి రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా 1983 నుంచి 1986 మధ్య విక్రయించగా కొనుగోలు చేశామన్నారు. అప్పటి నుంచి తమ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. కొంతమంది ప్లాట్ల చుట్టూ గోడలు కట్టుకోగా, మరి కొంతమంది గదులు నిర్మించుకున్నారని తెలిపారు. తమ ప్లాట్లపై స్థానికంగా ఉండే వేమిరెడ్డి సురేందర్ రెడ్డి కన్నుపడిందని, అప్పటి నుంచి తమకు ఇబ్బందులు, బెదిరింపులు మొదలయ్యాయన్నారు. తమకు విక్రయించిన పట్టాదార్లు, వారి రెండో తరం వారు కుమ్మక్కై పార్టీషన్ దావా దాఖలు చేసుకున్నారన్నారు. తర్వాత లోక్ అదాలత్‌లో రాజీ పడి తప్పుడు పత్రాలు సృష్టించారన్నారు. తమ ప్లాట్లను వ్యవసాయ భూమిగా చూపించి, 2024లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు సురేందర్ రెడ్డి, జీ వెంకట్‌రెడ్డిలకు విక్రయించారన్నారు. అప్పటి నుంచి కింది కోర్టు మొదలుకుని సుప్రీంకోర్టు వరకు న్యాయం కోసం పోరాడగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. తహసీల్దార్ విచారణ జరిపి ఆన్‌లైన్ రికార్డులప్రకారం సర్వే నం. 180, 187లలో ఉన్నది వ్యవసాయ భూమి కాదని, ఇంటి స్థలాలుగా నిర్ధారించారన్నారు. అయినా సురేందర్ రెడ్డి తమను వేధిస్తున్నాడని, రెండుసార్లు ప్రహరీ గోడలు, గదులు కూల్చివేయించాడన్నారు. అతనిపై పలు సివిల్, క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. తాను నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ మంత్రి బంధువునని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. రౌడీలతో దాడులు చేయిస్తున్నాడన్నారు. తప్పుడు పత్రాలతో ప్రతి భూమిలో వివాదాలు సృష్టించడం, లోక్ అదాలత్‌లలో రాజీ చేసుకుని భూములు, డబ్బు వసూలు చేయడం ఆయన నైజమని ఆరోపించారు. తమ భూములపై ఆయనకు ఎలాంటి హక్కులు లేవని, వాటిని ఎవరూ కొన్ని మోసపోవద్దన్నారు. ఈ సమావేశంలో బాధితులు టీ సూర్యనారాయణ, శ్రీనివాస్, ఏ కృష్ణమూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పేరిట వాట్సా‌ప్‌లో ఫేక్ లింక్‌లు

- వివరాలు నమోదు చేసుకోమంటూ ఎర
- సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన


హైదరాబాద్ సిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జనాన్ని దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు ఉన్న ఏ అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనలో భాగంగా చేస్తోన్న ఇంటింటి సర్వేను కూడా సైబర్ మాయగాళ్లు వాడేస్తున్నారు. ఇంటింటి సర్వే పేరిట నకిలీ లింకులను వాట్సాప్‌లో పంపిస్తున్నారు. ఈ లింక్‌ను ఓపెన్ చేసి ప్రభుత్వ సర్వేలో పాల్గొని మీ వివరాలు నమోదు చేసుకోండి అంటూ ఎర వేస్తున్నారు. ఈ ప్రమాదకర లింక్‌లను ఎవరైనా ఓపెన్ చేస్తే.. వారి ఫోన్లు హ్యాక్ అవ్వడమే కాక వ్యక్తిగత సమాచారం చోరీ జరిగే అవకాశముంది. ఈ తరహా మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో ప్రభుత్వ సిబ్బంది స్వయంగా ఇళ్లకు వచ్చి సమాచారాన్ని సేకరిస్తారని, ఆన్‌లైన్ మోసాల బారిన పడవద్దని అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర్ సైబర్ క్రైమ్ డీసీపీ ధార కవిత ప్రజలకు సూచించారు.

'పీఎం కిసాన్' లింక్‌తో 2 లక్షలు ఫట్

భారత ప్రభుత్వం రైతుల కోసం ప్రారంభించిన పథకం.. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట వాట్సాప్‌లో లింకులు పంపి సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.2 లక్షలు కొట్టేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి(50)కి రెండ్రోజుల క్రితం పీఎం కిసాన్-2 అనే పేరుతో వాట్సాప్‌లో ఓ ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజీ) ఫైల్ వచ్చింది. పీఎం కిసాన్ అని ఉండడంతో వ్యాపారి లింక్‌ను టచ్ చేయగానే.. పలు అప్లికేషన్లు ఫోన్‌లో డౌన్‌లౌడ్ అయిపోయాయి. అదే క్రమం లో అతని బ్యాంకు ఖాతాలోని రూ.2 లక్షలను సైబర్ కేటుగాళ్లు కొట్టేశారు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

కులగణనతోనే సామాజిక అంతరాలు పోవు

- "కుల గణన ఎందుకు?" పై ప్రొ. నాగేశ్వర్



హైదరాబాద్ సిటీ, నవంబరు9(ఆంధ్రజ్యోతి): కులగణనతో సామాజిక అంతరాలు తొలగిపోతాయనే వాదన సరికాదని ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చెప్పారు. పబ్లిక్ లెక్చర్స్ సిరీస్‌లో భాగంగా 'కుల గణన ఎందుకు?' అనే అంశంపై శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఓ సివిల్స్ కోచింగ్ సెంటర్‌లో ఆయన కీలకోపన్యాసం చేశారు. కులగణన వల్ల రిజర్వేషన్ల డిమాండ్ పెరుగుతుందనడంలోనూ సహేతుకత లేదని ఆయన కొట్టిపడేశారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి విధానాల రూపకల్పన కోసం సర్వేలు చేసుకొనే అధికారం రాష్ట్రాలకు ఉందన్న ఆయన కులగణన చేయడమంటే కులానికి సామాజిక, ఆర్థిక స్థితిగతుల మధ్య సంబంధాన్ని తెలుసుకోవడమన్నారు. వెనుకబడిన తరగతుల్లో కొన్ని వర్గాలు అభివృద్ధి చెందుతుంటే, మరికొన్ని వర్గాలు మరింత అణచివేతకు గురవుతున్నాయని నాగేశ్వర్ చెప్పారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు సశాస్త్రీయంగా అమలు చేయడానికైనా కులాల వారీ లెక్కలు తెలియాలన్నారు.

ఇళ్లు ఇచ్చారు.. వసతులు మరిచారు

• డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో విద్యుత్ లైట్లు లేక తీవ్ర ఇబ్బందులు • అడవి పందులు, పాములతో ఇబ్బందులు
• కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా.. సమస్య పరిష్కారం కాలేదంటున్న కాలనీవాసులు

వనపర్తి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్లలో సమస్యలు తిష్టవేశాయి. గత ప్రభుత్వ హయాంలో పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించారు. ఇల్లు దక్కిందని ఎంతో మంది ఆనందంగా అక్కడ ఉంటున్నారు. ఇళ్లకు దగ్గరలో గుట్ట ఉండడంతో రాత్రివేళలో అడవి పందులు, విష సర్పాలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. విద్యుత్ స్తంభాలకు కనీసం వీధి లైట్లు కూడా లేకపోవడంతో అడవి పందులతో విష సర్పాలతో భయాందోళన చెందుతున్నారు. వీధి లైట్లపై అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ తూతూమంత్రంగా స్తంభాలకు చిన్న 80 వాట్స్ బల్బులు బిగించి వెళ్లారు. అప్పటి నుంచి వారి బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. అప్పటి ప్రభుత్వ హయాంలో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న నిరంజన్‌రెడ్డికి డబుల్‌బెడ్రూం ఇళ్ల చుట్టూ ఒక కంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తే విష సర్పాల నుంచి అడవి పందుల నుంచి విముక్తి లభిస్తుందని కోరగా.. కంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తానని చెప్పడం తప్పా.. పని జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మా కాలనీ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.




పెద్దగూడెం శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్లు, విద్యుత్ స్తంభానికి బిగించిన బల్బు

వీధి లైట్లు ఏర్పాటు చేయండి



కనీసం కాలనీలో వీధి లైట్లు ఏర్పాటు చేస్తే కాస్త సమస్య తగ్గుతుంది. సాయంత్రం అయితే చిన్న పిల్లలు బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. విషసర్పాలు, అడవి పందులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇళ్ల చుట్టూ కంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టండి.

- విజయమని, డబుల్ బెడ్రూం వాసి

మాకు సంబంధం లేదు..

డబుల్ బెడ్రూం ఇళ్లు మా పరిధిలో లేవు, అవి మునిసిపాలిటీ పరిధిలో ఉన్నాయి. ఒక వేళ గ్రామపంచాయతీకి అప్పగిస్తే అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీవో రాఘవ అన్నారు. ఆ ఇళ్లు మునిసిపాలిటీ శివారులో లేవని, అది అభివృద్ధి చేయాలంటే గ్రామపంచాయతీలే చేయాలి. వాటితో మాకు సంబంధం లేదని మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్ తెలిపారు.

ఇంటర్వ్యూ..



ప్రతీ ఇంటి వివరాలు నమోదు చేయాలి

- రవీంద్ర, ఎంపీడీవో

పెబ్బేర్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సభ్యుల ఇంటింటి సర్వేలో ప్రజలంతా భాగస్వాములుగా సహకరించాలని ఎంపీడీవో రవీంద్ర అన్నారు. శనివారం నుంచి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించనున్నట్లు చెప్పారు. ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక, కులాల అంశాలపై సర్వే నిర్వహిస్తున్నామని ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూలో తెలియజేశారు.

సమగ్ర సర్వేలో మండల వ్యాప్తంగా ఎన్ని ఇళ్లలో, ఎంత మంది ఎన్యుమరేటర్లను నిర్వహించారు.?

మండల వ్యాప్తంగా 8,810 కుటుంబాల ఇళ్లలో సర్వే నిర్వహించాం. 71 మంది ఎన్యుమరేటర్లు సర్వేలో పాల్గొన్నారు.

ఎప్పటి వరకు సర్వే నిర్వహిస్తారు.?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నెల 18 వరకు గ్రామాల్లో సర్వే నిర్వహించి 19 నుంచి 20 తేదీల వరకు డేటా ఎంట్రీ చేస్తారు. 30వ తేదీ నాటికి సర్వే పూర్తి చేస్తాం.

వలస వెళ్లిన కుటుంబ సభ్యుల వివరాలు ఎలా సేకరిస్తారు.?

వలస వెళ్లిన వారు కుటుంబ సభ్యుల్లో ఒకరు తప్పనిసరిగా ఇంటికి రావాలి. కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డుల నంబర్లు, కులం, విద్య, భూముల వివరాలను తెలియజేసిన తర్వాత వివరాలు నమోదు చేసిన పత్రంపై ఇంటి యజమాని సంతకం చేయాలి.

ఎన్ని అంశాలపై సర్వే నిర్వహిస్తారు.?

సర్వేలో 75 అంశాలపై సర్వే నిర్వహిస్తాం. అంశాలపై కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తాం. కుటుంబ సభ్యుల సూచన ప్రకారమే వారిపై ఎలాంటి వత్తిడి లేకుండా సర్వే నిర్వహిస్తాం.

చెక్కు అందజేత

పెబ్బేర్‌రూరల్, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన చిక్కెపల్లి కర్ణకార్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైనా రూ.60 వేల చెక్కును కేబీ నాయుడు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు లక్ష్మణ్‌నాయుడు, గోపాల్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పాన్‌గల్, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం డాక్టర్ మైథిలి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాన్‌గల్ ఆరోగ్య కేంద్రంలో గర్భిణులను పరీక్షించి వారికి ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. 108 వాహనం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత

పెబ్బేర్‌రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగాపురానికి చెందిన మణ్యంయాదవ్ కొన్ని రోజుల కిందట పోగొట్టుకున్న ఫోన్‌ను శనివారం అప్పగించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఫోన్‌ను గుర్తించినట్లు తెలిపారు. సెల్ ఫోన్ ఎక్కడపడితే అక్కడ పెట్టి మరిచిపోయి నిర్లక్ష్యంగా ఉండరాదని ఎస్‌ఐ ఈ సందర్భంగా తెలియజేశారు.

శుభకార్యాలకు మాజీమంత్రి హాజరు

గోపాల్‌పేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో పలు శుభకార్యాలకు మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. శనివారం మండలంలోని చెన్నూరులో బీఆర్‌ఎస్ నాయకులు బత్తుల శ్రీశైలం కుమార్తె పతా నానికి హాజరై వధువును ఆశీర్వదించారు. అనంతరం బుద్దారంలో నూతన గృహ ప్రవేశానికి హాజరయ్యారు.

బహిరంగంగా మద్యం తాగితే కేసులు

వనపర్తి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని రూరల్ ఎస్‌ఐ జలంధర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం వనపర్తి మండల పరిధిలోని మర్రికుంట శివారులో మద్యం తాగుతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి మాట్లాడారు. యువత మద్యం తాగేందుకు ఎక్కువ అలవాటు పడుతున్నారని, వారి తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని సూచించారు.

హాస్టల్ సిబ్బందికి సన్మానం

శ్రీరంగాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో పని చేసి పదవీ విరమణ చేసిన బాలస్వామి, అహ్మద్‌లను అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రాజేష్, బుచ్చన్న, కురుమయ్య బీమపల్లి ఎల్లస్వామి, శ్రీనివాసులు, నరసింహ, విజయ్, చంద్రశేఖర్, ఆర్‌పి బీసన్న, రమేష్, కురుమూర్తి, శివ, జయరాజు, సిద్దార్థ, అనిల్, ప్రవీణ్, ఆంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

పెబ్బేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సంత స్థలం సంరక్షించుకోవడానికి శనివారం సంత సంరక్షణ సమితి సభ్యుల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సంత పరిరక్షణ సభ్యులు వేణుగోపాలస్వామి, పరిరక్షణ సమితి సభ్యులు గోల్డ్ బాలస్వామి, దయాకర్ రెడ్డి, బసవరాజు గౌడ్, గోనెల సహదేవుడు, సంతోష్ కుమార్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు



వనపర్తిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరచారి

వీపనగండ్ల, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న సీపీఎం జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ కోరారు. శనివారం మహాసభలు నిర్వహించనున్న ప్రాంగణంలో వీర తెలంగాణ సాయుధ తెలంగాణ పోరాట ఘటనల ఫొటో ఎగ్జిబిషన్‌ను సీనియర్ నాయకులు ఏ. భాస్కర్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ జబ్బార్ మాట్లాడారు. ప్రజలు కార్మికులు, రైతులు అందరూ మహాసభలకు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. బాల్‌రెడ్డి, మౌలాలి, మురళి పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పాన్‌గల్ : వీపనగండ్ల మండల కేంద్రంలో నిర్వహించే సీపీఎం జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ ఒక ప్రకటనలో కోరారు.

అమరచింత : వీపనగండ్ల మండల కేంద్రంలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు కొనసాగే సీపీఎం జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పామిరెడ్డిపల్లిలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఎం నాయకులు శంకర్, రాజు, మల్లేష్, జగదీష్ పాల్గొన్నారు.

వనపర్తి టౌన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తిరగబడుతామని సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరచారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు కురుమయ్య, బాలస్వామి, మదన్, రమేష్, పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తేవాలి



ఖిల్లాఘణపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్ గౌడ్

ఖిల్లాఘణపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన వరి ధాన్యాన్ని తాలు, మట్టి, రాళ్లు లేకుండా వరి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండలంలోని అల్లమాయపల్లి, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపూర్, మామిడిమాడ, పర్వతాపూర్, ఖిల్లాఘణపురం, ఉప్పరిపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఉప్పరిపల్లిలో ఆరబెట్టిన వరి ధాన్యం తేమ శాతం పరిశీలించారు. మురళీధర్ రెడ్డి, విజయ్ కుమార్, క్యామ రాజు, కృష్ణయ్య గౌడ్, వెంకటేశ్వరరావు, శ్యాంసుందర్ రెడ్డి, కృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట : రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకొని లాభం పొందాలని మదనాపురం మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ అన్నారు. శనివారం కొత్తకోటలో వరి ధాన్యం కొనుగోళ్లను వ్యవసాయ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని తొందరపాటుగా దళారులకు అమ్ముకొని మోసపోవద్దన్నారు. రవీందర్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి బాలరాజు, మోహన్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

పెబ్బేర్‌రూరల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని పెబ్బేర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని అన్నారు. శనివారం మండలంలోని రంగాపురంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా ,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు అవసరమైన వివరాలు అందించి సహకరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. శనివారం సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైన నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చీఫ్‌సెక్రటరీ శాంతికుమారి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని, సిబ్బందికి వివరాలు చెప్పాలన్నారు. ఇప్పటికే హౌస్ లిస్టింగ్ పూర్తి అయిందని, ఇక సర్వేలో పొరపాట్లు తప్పులు లేకుండా వివరాలు సేకరణ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్యుమరేటర్లకు ఎలాంటి అనుమానాలు ఉన్నా సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 1392 ఎన్యుమరేటర్ బ్లాక్‌లలో, ఎన్యుమరేటర్లు కుటుంబ వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. అంతకుముందు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం 2025 సందర్భంగా ప్రతీ పోలింగ్ బూత్‌లో ఓటర్ల జాబితా ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ క్యాంపెయిన్‌ను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మర్రికుంటలోని 179, బండారునగర్‌లోని 153, 155, 156, ఇందిరానగర్‌లోని 117 పోలింగ్ బూత్‌లను కలెక్టర్ సందర్శించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, భూపాల్ రెడ్డి, భగవాన్, మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్, రమేష్‌రెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వలస కూలీ మృతి

అమరచింత, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రకాశం జిల్లా, పుల్లల చెరువు మండలం, ఎర్రకుండా పాలెంకు చెందిన పెద్ద ఏసుదాసు(48) తోటి కూలీలతో కలిసి కొన్నాళ్లుగా అమరచింత ప్రాంతంలో చెరుకు కోతల కూలీకి వచ్చాడు. అదే తరుణంలో మస్తీపూర్ శివారులోని రైస్ మిల్ సమీపంలో ఓ రైతు పొలంలో చెరుకు కోతలు పూర్తి చేసుకుని అక్కడ వచ్చిన ట్రాక్టర్‌పై కూలీలతో కలిసి ఏసుదాసు చెరుకును లోడ్ చేశాడు. ఈ క్రమంలో దాహం వేసి తోటి కూలీలతో కలిసి రహదారి పక్కన నిల్చుండి నీరు తాగుతుండగా.. మస్తీపూర్ నుంచి చంద్రఘడ్ వైపునకు వెళ్లే ద్విచక్ర వాహనం అతి వేగంగా వచ్చి ఏసుదాసు ఛాతికి ఢీకొంది. దీంతో ఏసుదాసు రహదారిపై పడిపోయాడు. వెంటనే ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు పరిశీలించి ఏసుదాసు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన మరో వ్యక్తికి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొత్తకోట, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర సమీపంలోని కానాయపల్లి, నిర్వేన్, పాలెం, కొత్తకోట గ్రామాల సరిహద్దులోని వెంకటగిరి క్షేత్రంలో ఏకశిలపై భూలక్ష్మీ సమేతుడుగా వెలసిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో వేదపండితులు శనివారం నిర్వహించారు.

న్యూస్ బాక్స్

సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం..

వనపర్తి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. శనివారం శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి ఈ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తెలంగాణ జాతిపితగా రాష్ట్రాన్ని కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేసి దేశంలోనే ఒక మోడల్‌గా తీర్చిదిద్దారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై ఇంకోసారి వ్యాఖ్యలు చేస్తే తిరిగి అంతకన్నా ఎక్కువ చేయగలుగుతామని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, శ్రీధర్, నాగన్న యాదవ్, తిరుమల్, సూర్యవంశం గిరి, హేమంత్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

కొత్తకోట, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : పట్టణ మునిసిపల్ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్‌ను కొత్తకోట నగర యువజన సంఘం నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. జిల్లాలోని గ్రంథాలయాలను పాఠకులు వినియోగించుకోవడానికి తగినన్ని పుస్తకాలు ఏర్పాటు చేయాలని కోరారు. సన్మానం చేసిన వారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుతపయ్య, కోశాధికారి కురుమూర్తి, నరేందర్ సాగర్, జయరాములు, సురేష్ సాగర్, వినోద్ సాగర్, రమేష్ సాగర్, రాజబాబు, కృష్ణ, విజయ్ కుమార్, రామాంజనేయులు నవీన్ ఉన్నారు.

రాక్‌వుడ్ పాఠశాలలో విద్యావైజ్ఞాన సదస్సు

కొత్తకోట, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాక్‌వుడ్ పాఠశాలలో విద్యావైజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన విద్యావైజ్ఞాన సదస్సులో పర్యావరణం - పరిరక్షణ, అడవులు - జంతువుల సంరక్షణ, పక్షులను కాపాడుటకు వాటి జీవన విధానాలపై ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థుల ప్రదర్శనలను తల్లిదండ్రులు, పట్టణ విద్యావంతులు, యువకులు సందర్శించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ.. విద్యతో పాటు వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులను మంచి ఆలోచనల వైపు మళ్లిస్తాయన్నారు.

విరాళం అందజేత

కొత్తకోట, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠాపనకు బీజేపీ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ అనుసూయమ్మ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు రూ.2 లక్షల పదహారు వేల విరాళం శనివారం నిర్వాహకులకు అందజేశారు. విరాళం అందుకున్న వారిలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బాలకొండయ్య, తిమ్మన్న యాదవ్, సత్యం యాదవ్, వెంటన్న యాదవ్ ఉన్నారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయండి

అమరచింత, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడానికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో ప్రతీ ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. సీఎం బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, భూమి పూజలు చేయనున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ముస్లింలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బీఆర్‌ఎస్ నాయకులు, వక్ఫ్ ఆస్తుల రక్షణ కోఆర్డినేషన్ కమిటీ మాజీ సభ్యులు షేక్ జహంగీర్ అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ముస్లిం డిక్లరేషన్‌లో భాగంగా ఆర్థిక బడ్జెట్‌లో రూ.4వేల కోట్లు కేటాయిస్తామని, మైనార్టీ సబ్ ప్లాన్ తీసుకొస్తామని చెప్పి నెరవేర్చలేదన్నారు. మసీదు లో పని చేసే ఇమామ్, మౌజన్‌లకు వేతనాలు రూ.12 వేలు చేస్తామని ఇప్పటికీ హామీ నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు. తక్షణమే ఇమామ్, మౌజన్‌లకు పెండింగ్‌లోని వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రతీ పోలింగ్ బూత్‌లో ఓటర్ల జాబితా ప్రదర్శించాలి



జిల్లా కేంద్రంలోని మర్రికుంటలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం 2025 సందర్భంగా ప్రతీ పోలింగ్ బూత్‌లో ఓటర్ల జాబితా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ క్యాంపెయిన్‌ను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని మర్రికుంటలోని 179, బండారు నగర్‌లోని 153, 155, 156, ఇందిరా నగర్‌లోని 117 పోలింగ్ బూత్‌లను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఓటరు జాబితాలో డబుల్ ఓట్లు ఉంటే వాటిని ఫారం 7 ద్వారా తొలగించాలన్నారు. మార్పులు ఏమైనా ఉంటే ఫారం 8 ద్వారా సరి చేసుకోవాలన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఎవరైనా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకుంటే ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం బీఎల్‌వోలు ఇప్పుడు అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి, పూర్ణచందర్, బీఎల్‌వోలు, కలెక్టర్ వెంట ఉన్నారు.

ఓటు హక్కును నమోదు చేసుకోవాలి



ఆత్మకూరు పట్టణ కేంద్రంలో బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఓటు హక్కు నమోదు కేంద్రం

ఆత్మకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పద్దెనిమి ఏళ్ల వయసు నిండిన యువతీ యువకులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. తెలంగాణ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు మండలంలోని ఆయా గ్రామాల్లో అలాగే పట్టణ కేంద్రంలోని బూత్‌లో ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫామ్ 6, 7, 8ల ద్వారా ఓటు హక్కు నమోదు తప్పు ఒప్పుల సవరణ చనిపోయిన వారి ఓట్లను తొలగించడం, వంటి వాటిని చేపట్టనున్నట్లు చెప్పారు. అలాగే తమ ఓటు ఉందో లేదో అనే సమాచారాన్ని కూడా బూత్ వద్దకు వెళ్లి తెలుసుకోవాలన్నారు. ఈ అవకాశం మనం మూడు రోజుల పాటు ఉంటుందని, 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఓటరు నమోదు కేంద్రం పరిశీలన

అమరచింత : ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్ కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీ కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో కొనసాగుతున్న కేంద్రాన్ని పరిశీలించి, ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 9, 10 తేదీల్లో ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందన్నారు.

వీపనగండ్ల : ఓటు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివారావు కోరారు. శనివారం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు ఓటు నమోదుకు దరఖాస్తులు తీసుకుంటున్నారన్నారు.

సమగ్ర సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



మేడపల్లి గ్రామంలో ఇంటింటి సర్వేలో పాల్గొన్న తహసీల్దార్

అమరచింత, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమగ్ర సర్వేలో దివ్యాంగులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మాకం శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వేలో పూర్తి వివరాలు పొందుపరచడానికి క్రమ సంఖ్య నంబర్ 13లో తమ కోటాను కేటాయించారని ఆయన గుర్తు చేశారు. వికలాంగులు సదరం సర్టిఫికెట్ ఐడీ నంబర్ ఆధార్ కార్డులను సర్వేకొచ్చిన వారికి సమర్పించి వికలత్వ కేటగిరిలో పూర్తి వివరాలను నమోదు చేయాలని కోరారు. సర్వేతో భవిష్యత్తులో జరిగే ఎన్నికలు పథకాల్లో దివ్యాంగుల కోటకు సర్వే ఉపయోగపడుతుందన్నారు.

కొనసాగుతున్న సర్వే

పెద్దమందడి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే శనివారం ప్రారంభమైంది. సర్వేను జిల్లా, మండల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సద్గుణ మాట్లాడారు. ఒక కుటుంబం సంబంధించిన మొత్తం వివరాలు ఒకే దగ్గర ఉండాలని, తల్లిదండ్రులు, కుమారుడు, కోడలు వేర్వేరుగా ఉంటే ఇంకో రిజిస్టర్‌ను నమోదు చేయాలని సూచించారు. సొంత ఊరిలో ఉండకపోయినా... ఎక్కడ ఉంటే అక్కడే వారి వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. ఎన్యుమరేటర్లు అధికారులు ఎక్కడ ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించాలన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్వే అధికారులు ఉన్నారు.

ఆత్మకూరు : ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతుంది. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో , కమిషనర్ శశిధర్ సమగ్ర సర్వే వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, ఎంపీవో శ్రీరామ్ రెడ్డి, కమిషనర్ శశిధర్‌తో పాటు ఆయా గ్రామాల ఎన్యుమరేటర్లు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ



అమరచింతలో శిక్షణ ఇస్తున్న నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ శిక్షకుడు

అమరచింత , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : లేబర్ ఇన్సూరెన్స్ కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు కార్మిక శాఖ ఆధ్వర్యంలో శనివారం అమరచింతలో శిక్షణ, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ శిక్షకుడు గంగాధర్ మాట్లాడుతూ... లేబర్ ఇన్సూరెన్స్ కార్డు కలిగి ఉన్న వివిధ రంగాల అసంఘటితరంగా కార్మికులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమరచింతలో భవన నిర్మాణ రంగంలోని మేస్త్రీలు, తాపీ మేస్త్రీలకు వారం రోజులుగా శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో మేస్త్రీలకు టీ షర్ట్, క్యాప్, భోజన వసతితో పాటు ప్రతీ రోజు శిక్షణకు హాజరయ్యే ఒక్కొక్క కార్మికుడికి రూ.300 ఇవ్వనున్నట్లు చెప్పారు. 15 రోజుల శిక్షణ పూర్తయిన తరువాత సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నట్లు పేర్కొనారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారం కోసం కృషి చేయాలి

పెబ్బేర్‌రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారం కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కొత్త సూగుర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. స్థానికంగా పార్టీ బలంగా ఉన్నప్పుడే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రగౌడు, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, దేవేందర్‌నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు బీమా సౌకర్యం



బీమా నమోదు కల్పిస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్

ఆత్మకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మునిసిపల్ కేంద్రంలోని పారిశుధ్య, వాటర్, ఎలక్ట్రికల్ తదితర విభాగాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మునిసిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్ ఆధ్వర్యంలో బీమా సౌకర్యం కల్పించినట్లు మునిసిపల్ కమిషనర్ శశిధర్ తెలిపారు. పట్టణ కేంద్రంలో సుమారుగా 30 మందికి పైగా కార్మికులు అవుట్ సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. వారికి సమగ్ర రక్షణ ప్లాన్, ప్రమాద బీమా వంటి బీమా సౌకర్యం కల్పించారు. మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.